# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 14-02-2025** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు రేపు శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో జరిగే స్వచ్ఛంధ్ర కార్యక్రమంలో పాల్గొంటారు.**
2. **ఆంధ్రప్రదేశ్ రెండవ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య జయంతిని రాష్ట్ర ప్రభుత్వం ఈరోజు అధికార కార్యక్రమంగా నిర్వహిస్తోంది.**
3. **క్యాన్సర్ వ్యాధి పట్ల అవగాహన కల్పిస్తూ తిరుపతి, చిత్తూరు నగరాలలో ప్రదర్శనలు నిర్వహించారు.**
4. **రాష్ట్రంలో ఉమ్మడి ప్రవేశ పరీక్షల షెడ్యూల్ ను ప్రభుత్వం విడుదల చేసింది.**
5. **పుల్వామా ఉగ్రవాద దాడిలో అమరులైన భారత సైనికులకు దేశ ప్రజలు నివాళులు అర్పిస్తున్నారు.**

==========================

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో రేపు పర్యటిస్తారు. ప్రతి నెలా మూడవ శనివారం రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించే స్వచ్చాంధ్ర కార్యక్రమంలో భాగంగా కందుకూరు సమీపంలోని దూబాగుంట గ్రామంలో జరిగే కార్యక్రమంలో ఆయన పాల్గొంటారు. అనంతరం .... వ్యవసాయ మార్కెట్ యార్డులో ప్రజలతో ముఖాముఖి నిర్వహిస్తారు. ముఖ్య మంత్రి పర్యటించే ప్రాంతాలలో జిల్లా కలెక్టర్..., పోలీసు అధికారులు పర్యటించి భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు.

--------------------------

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రెండవ ముఖ్యమంత్రి ...., తొలి దళిత ముఖ్యమంత్రి రాష్ట్రంలో, కేంద్రంలో పలు మార్లు మంత్రి పదవి నిర్వహించిన దామోదరం సంజీవయ్య జయంతి ఈ రోజు. ఈ సందర్భంగా ఆ మహనీయునికి రాష్ట్ర ప్రజలు ఘనంగా నివాళులు అర్పిస్తున్నారు. కర్నూలు జిల్లా పెదపాడులో 1921వ సంవత్సరం ఫిబ్రవరి 14 వ తేదీన జన్మించిన ఆయన రెండు సార్లు అఖిల భారత కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడుగా వ్యవహరించారు. 1960 సంవత్సరంలో ముఖ్య మంత్రిగా సమర్ధమైన బాధ్యతలు నిర్వర్తించారు.

దామోదీరం సంజీవయ్య జయంతిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం అధికారిక కార్యక్రమంగా నిర్వహిస్తోంది. దామోదరం సంజీవయ్యకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నివాళులు అర్పిస్తూ.. నీతి, నిజాయితీ,

పట్టుదలకు దామోదరం సంజీవయ్య ప్రతీకగా నిలిచారని అన్నారు.

---------------------------

ఒంగోలు పట్టణంలో జరిగిన మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య జయంతి కార్యక్రమంలో రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి శ్రీ డోలా బాల వీరాంజనేయ స్వామి దామోదరం సంజీవయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ

వాయిస్.. 25 సెకన్లు

చిత్తూరులో జరిగిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ దామోదరం సంజీవయ్యకు నివాళులు అర్పించారు. పిన్న వయసులోనే ముఖ్యమంత్రి బాధ్యతలు చేపట్టిన ఘనత ఆయనదని అన్నారు. తిరుపతి నగరంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వేంకటేశ్వర్ పాల్గొని మాట్లాడుతూ... కృషి... పట్టుదల..., క్రమశిక్షణకు దామోదరం సంజీవయ్య మారుపేరని అన్నారు.

---------------------------

కర్నూలులో తొలి బర్డ్ ఫ్లూ కేసు నమోదైంది. నగరంలోని నరసింహారావు పేటలో నమోదైనట్లు కె.ఎం.సి ఆరోగ్య శాఖ అధికారులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. దీంతో నగరంలోని నరసింహారావు పేట, పరిసర ప్రాంతాలను రెడ్ జోన్‌గా ప్రకటించినట్లు అధికారులు వెల్లడించారు.

---------------------------

ఆకాశవాణి తిరుపతి కేంద్రం ఆధ్వర్యంలో రేపు ఉదయం చిత్తూరు జిల్లా పెనుమూరులో రైతుల సౌలభ్యం కోసం రేడియో రైతు దినోత్సవ సదస్సు నిర్వహిస్తున్నట్టు తిరుపతి ఆకాశవాణి కేంద్రం సహాయ సంచాలకులు సుధాకర్ మోహన్ ఒక ప్రకటనలో తెలిపారు. చిత్తూరు జిల్లా స్థాయి వ్యవసాయ ...., అనుబంధ శాఖల అధికారులు, శాస్త్రవేత్తలు ఈ సదస్సులో పాల్గొని రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులు, యాజమాన్య పద్ధతులను వివరిస్తారని ఆయన చెప్పారు రైతులందరూ ఈ కార్యక్రమంలో పాల్గొని ఆధునిక వ్యవసాయ విధానాలను అవగాహన చేసుకోవాలని ఆ ప్రకటనలో సుధాకర్ మోహన్ కోరారు.

---------------------------

క్యాన్సర్ వ్యాధి పట్ల అవగాహన కల్పిస్తూ ఈరోజు తిరుపతి ...., చిత్తూరు నగరాలలో ప్రదర్శన జరిగింది. తిరుపతి నగరంలో నెహ్రూ మున్సిపల్ మైదానం నుండి ఈ ప్రదర్శనను జిల్లా కలెక్టర్ వేంకటేశ్వర్ ...,.పోలీసు సూపరింటెండెంట్ హర్షవర్ధన్ రాజు ...., శాసన సభ్యులు ఏ. శ్రీనివాసులు ప్రారంభించారు.

చిత్తూరులో జరిగిన ప్రదర్శనను చిత్తూరు జిల్లా వైద్య ..., ఆరోగ్య శాఖ అధికారి సుధారాణి ప్రారంభించారు. తిరుపతి జిల్లా కలెక్టర్ వేంకటేశ్వర్ మాట్లాడుతూ ...క్యాన్సర్ ను ప్రాథమిక దశలోనే గుర్తిస్తే సులువుగా నయం చేసే అవకాశం ఉందని అన్నారు. క్యాన్సర్ వ్యాధి గురించి అవగాహన కలిగించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక చర్యలు తీసుకుంటున్నాయని వెంకటేశ్వర్ పేర్కొంటూ .........

.....వాయిస్.... 30 సెకన్లు....

---------------------------

రాష్ట్రంలో ఉమ్మడి ప్రవేశ పరీక్షల షెడ్యూల్‌ను మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేష్ విడుదల చేశారు. ఇంజినీరింగ్ ...., ఫార్మసీ ..., వ్యవసాయ కోర్సులలో ప్రవేశాల కోసం నిర్వహించే ఈ. ఏ. పి.

సెట్ మే 19 …., 20 తేదీలలో జరుగుతుంది. మే 2వ తేదీ నుండి ప్రారంభమయ్యే ఈ ప్రవేశ పరీక్షలు జూన్ 25వ తేదీ వరకు జరుగుతాయి..

ఏపీ ఆర్ సెట్….పి.హెచ్.డి. మే 2 నుండి 5 వరకు జరుగుతుంది. ఈ సెట్ …. మే 6 వ తేదీన …., ఐ సెట్… మే 7 వ తేదీన …., ఈ. ఏ. పి. సెట్ ఇంజినీరింగ్ మే 21 నుండి 27 వరకు నిర్వహిస్తారు.

లా సెట్ ….మే 25 న …, పి.జి.ఈ. సెట్ …జూన్ 5, 6, 7 తేదీలు…., ఎడ్ సెట్ జూన్ 8న …, పి.జి. సెట్ …. జూన్ 9 నుండి 13 వరకు …, పి. ఈ. సెట్. జూన్ 25 వ తేదీన జరుగుతుంది.

-------------------------

జమ్మూ కాశ్మీర్‌లోని పుల్వామా జిల్లాలో భారత సైనిక బలగాలే లక్ష్యంగా ఉగ్రవాదులు జరిపిన ఆత్మాహుతి దాడిలో 40 మంది భారత సైనికులు అసువులు బాసిన ఘటనకు ఈ రోజుతో ఆరేళ్ళు పూర్తయ్యాయి. ఈ ఘటనలో అమరులైన భారత సైనికులకు యావత్ దేశ ప్రజలు ఘనంగా నివాళులు అర్పిస్తున్నారు. 2019వ సంవత్సరం ఫిబ్రవరి 14వ తేదీన ఉగ్రవాదులు ఈ దుశ్చర్యకు పాల్పడ్డారు. ఆ రోజున పుల్వామాలో ఒక భారత సైనిక వాహన శ్రేణిపై ఉగ్రవాదులు జరిపిన ఆత్మాహుతి దాడిలో కేంద్ర రిజర్వు భద్రతా బలగాలకు చెందిన 40 మంది అమరులు కావడం దేశ ప్రజలను కలచివేసింది. దేశం కోసం ప్రాణ త్యాగం చేసిన ఈ అమరవీరులకు నివాళిగా కేంద్ర ప్రభుత్వం ఫిబ్రవరి 14వ తేదీని "బ్లాక్ డే" గా ప్రకటించింది.

-------------------------

రాష్ట్రంలోని అంగన్వాడీ కేంద్రాలకు అందజేసే ఆహారంలో మరిన్ని పోషక విలువలు జోడిస్తూ మార్పులు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. చిన్నారులు, గర్భిణీలకు అందించే పాలు, బాలామృతంలో ఈ మార్పులు చేయనున్నది. బాలామృతంలో మరిన్ని పోషక విలువలు జోడించ నున్నది. ఇప్పటికే… కొన్ని జిల్లాలలో పైలట్ ప్రాజెక్టుగా ప్రభుత్వం దీనిని అమలు చేస్తోంది. ఈ కార్యక్రమాన్ని త్వరలోనే రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేయనున్నది. అంగన్వాడీ ఆహారంలో మార్పులు చేసే బాధ్యతను అక్షయ ఫౌండేషన్ కు ప్రభుత్వం అప్పగించింది.

-------------------------

చిన్నారులలో పుట్టుకతో వచ్చే గుండె జబ్బుల పట్ల ఈ రోజు అవగాహనా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. శిశువులు జన్మించినపుడు ఇటువంటి జబ్బులు తేలికపాటి నుండి తీవ్రమైన వాటి వరకు ఉండే అవకాశం ఉంది. శిశువులు జన్మించిన వెంటనే వీటిని గుర్తించి తగిన చికిత్స అందిస్తే …. సమస్యను శాశ్వతంగా నివారించవచ్చు. పీడియాట్రిక్ కంజెనిటల్ హార్ట్ అసోసియేషన్ …, అమెరికన్ హార్ట్ అసోసియేషన్ వంటి ప్రముఖ సంస్థలు ఈ అవగాహనా దినోత్సవాన్ని విస్తృతంగా ప్రచారం చేస్తున్నాయి.

-------------------------

రాష్ట్రంలో ఎలక్ట్రానిక్స్ …., టెక్స్ టైల్…, ఫుట్ వేర్ రంగాల అభివృద్ధికి సహకారం అందించేందుకు తైవాన్ దేశం ముందుకు వచ్చింది. మానవ వనరులు …, ఐ.టి. శాఖల మంత్రి నారా లోకేష్‌తో గుంటూరు జిల్లా ఉండవల్లిలో నిన్న సమావేశమైన తైవాన్ ప్రతినిధి బృందం ఈ మేరకు అంగీకారం తెలిపింది. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ….. ఎలక్ట్రానిక్స్, టెక్స్ టైల్, ఫుట్ వేర్ రంగాల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం ఆకర్షణీయమైన విధానాలను తీసుకు వచ్చిందని, అనుమతులతో పాటు ఉత్పత్తి ప్రారంభించే వరకు ప్రభుత్వం సహకరిస్తుందని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు తైవాన్ సహకరించాలని, ఎలక్ట్రానిక్స్, టెక్స్ టైల్, ఫుట్ వేర్ రంగాలలో పార్కులు ఏర్పాటు చేయాలని నారా లోకేష్ కోరారు.

=====================